తేది: 10.03.2017

ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రచురణలు విస్తరణ సేవల కేంద్రం ఉప సంచాలకులు డా.డి.ఉదయ కుమారి సదస్సు సంచాలకులుగా "వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యం భారతీయ విద్యా వ్యవస్థ - ప్రతిఫలనం" అన్న అంశంపై రెండు రోజుల యు.జి.సి జాతీయ సదస్సును శుక్రవారం ఎమెనో భవనంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సదస్సు సంచాలకులు డా.డి.ఉదయ కుమారి సదస్సు ఉద్దేశాన్ని తెలియజేశారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య ఇ.సత్యనారాయణ, గౌరవ అతిథిగా ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి, కీలకోపన్యాసకులుగా ఆచార్య పాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, విశిష్ట అతిథిగా ఆచార్య జి.బాలసుబ్రమణియన్, సభాధ్యక్షులుగా ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌరవ అతిథి, కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి గారు మాట్లాడుతూ... 2500 సంవత్సరాలకు పూర్వమే మౌఖిక విద్యా భోధన ప్రారంభమైందన్నారు. అప్పటి నుండి ఆశ్రమాల్లో మౌఖిక విద్యను నేర్చడం మొదలు లిఖిత పూర్వకమైన అంశాలతో తరగతి బోధన, సంప్రదాయ విద్య, ఆధునిక విద్య, సార్వత్రిక విద్యలను అభ్యసిస్తూ అంచెలంచెలుగా కొత్త పద్ధతులను సంతరించుకొంటూ నేటి వరకు విద్యా విధానం సాగుతూ వస్తోందన్నారు. ప్రస్తుతపు విద్యా వ్యవస్థకు, పరిశోధనకు క్షేత్ర పర్యటన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం సమాజంలో స్త్రీ విద్య సాధికారత గురించి గొప్పగా చెప్పుకుంటున్నామే గానీ స్త్రీ విద్యా వ్యవస్థ ఎంత మేరకు మెరుగుపరుచుకోగలిగాము, ఎంత శాతము స్త్రీ విద్యాభివృద్ధి సాధించామన్నది ఎవరికి వారు ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాతృభాషలో విద్యను అభ్యసిస్తే భావవ్యక్తీకరణకు పూర్తిస్థాయిలో తోడ్పడుతుందని తెలిపారు.

ప్రముఖ విమర్శకులు, కేంద్ర సాహిత అకాడెమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు కీలకోపన్యాసం చేస్తూ... సాహిత్యంలో సమాజాన్ని ప్రతిబింబింపజేయడమే సాహిత్య అధ్యయనానికి ప్రమాణం అని పేర్కొన్నారు. ఈ సాహిత్య అధ్యయన ప్రమాణాలు రెండుగా విభజించుకోవచ్చని, ఒకటి సాహిత్య ప్రమాణాలు, రెండు సాహిత్యేతర ప్రమాణాలని పేర్కొన్నారు. సాహిత్య ప్రమాణాలు 170 అలంకార శాస్త్రాలపైనే ఆధారపడి ఉంటుందని, ఇది సమాజ మనుగడకు, ఉన్నతికి ఏమాత్రం తోడ్పడదని సాహిత్యంలో నిగూఢార్థం తెలుసుకోవాలంటే అంకార శాస్త్రాన్ని పరిశీలిస్తే ఫలితం ఉండదని, రెండవదైన సాహిత్యేతర ప్రమాణాలైన సాంఘిక, సామాజిక, మనస్తత్త్వ, రాజనీతి, గణిత, వైజ్ఞానిక మొదలైన శాస్త్రాలు వాస్తవికతకు దగ్గరగా ఉంటూ సమాజ మనుగడకు, ఉన్నతికి తోడ్పడుతాయని తెలిపారు. విద్యార్థులు కళాత్మక, విమర్శనాత్మక సాహిత్యాన్ని పరిశీలించాలన్నారు. పూర్వం నుండి విద్యా రంగం సామాజిక శాస్త్రవేత్తలను శాసన, కార్యనిర్వహణ, న్యాయ రంగాల్లో మేధావులను తయారు చేస్తోంది అని అన్నారు. ఈ సందర్భంగా విద్య గురించి, విద్యా విధానం గురించి, విద్యా ప్రయోజనాల గురించి వేమన, తిక్కన, పెద్దన, ఏనుగు లక్ష్మణకవి, గురజాడ, కందుకూరి, శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి మొదలైన వారు చెప్పిన పద్యాలను, వాక్యాలను ఉదహరించి సదస్సును రంజింపజేశారు. గతంలో సామాజిక పోరాటాల్లో ఉపాధ్యాయులు ప్రధాన పాత్ర పోషించేవారని, నేడు సామాజిక చైతన్యం తీసుకురావడంలో ఉపాధ్యాయులు ఎంత మేరకు తోడ్పడుతున్నారో ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. విద్యాభ్యాసం ప్రారంభం నుండి డిగ్రీ స్థాయి వరకు ప్రతి తరగతిలోనూ వృత్తులు, మానవత్వ విలువలు, స్త్రీని గౌరవించం, అంటరాని తనాన్ని / కుల వ్యవస్థను నిర్మూలించడం మొదలైన అంశాలను మాతృభాషల్లో పాఠ్యాంశాలుగా పెట్టాలని కోరారు.

సభకు అధ్యక్షత వహించిన వర్సిటీ ప్రచురణల కేంద్రం సంచాలకులు ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ... పూర్వం ఆశ్రమ విద్య నుండి నేటి విద్యా విధానం వరకు వివరిస్తూ 1857లో మెకాలే భారత దేశంలో కొత్తగా ప్రవేశపెట్టిన విద్యా విధానం వలన వచ్చిన మార్పులను, ఆ తరువాత 1990 నాటి నుండి ప్రైవేటు విద్యా విధానంలో వచ్చిన మార్పులను కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పులికొండ సుబ్బాచారి, ఆచార్య కె.శారద, డా.శ్రీదేవి, డా.దొరస్వామి, ప్రచురణల కేంద్రం బోధనా సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.






